చక్కని కుటీరంలాంటి ఈ ఇంట్లో ఒంటరిగా కిటికీకి ఆనించి కూర్చున్న నా శరీరాన్ని చల్లని వర్షపుగాలి గిలిగింతలు పెడుతూంది. బయటి వర్షపు చిందులకు లయగా నా హృదయం గంతులు వేస్తూంది. మనసు జరిగిపోయిన మధుర స్మృతులను గుర్తుకు తెస్తూంది. కథలు రాయాలన్న ఆశ చావని నా మనసు కాగితం, కలంకోసం వెదికింది. ఆనంద పారవశ్యపు ఆవేశాన్ని అదుపులోనికి తెచ్చుకొని నా పరిసరాల్నిసైతం మరచి కలవంటి ఆ స్వప్నానికి అక్షర రూపమివ్వ సమకట్టాను.

* * *

"పోస్ట్" అన్న పోస్ట్‌మన్ కంఠం మధురంగా సోకింది నా కర్ణపుటాలకు. ఓ ప్రత్యేకమయిన ఉత్తరం కోసం అమితంగా నిరీక్షించే మనిషికి ఆ పిలుపు ముందు గాంధర్వ సంగీతం కూడా రుచించదేమో! కవరు అందుకున్నాను. అనుకున్నట్లే అది రాధ నుండి వచ్చిన జాబే. అన్నీ అనుకున్నట్లే జరగవు. కాని, కొన్ని కొన్ని సార్లు అనుకున్నవి అనుకున్నట్లే జరిగి మనుషుల్ని ఆశ్చర్యంలో ముంచివేస్తాయి. అలాంటి ఆశ్చర్యమే ఆ ఉత్తరంకోసం నిరీక్షిస్తున్న నాకూ కలిగింది. అంతకు ముందటి నా మనః ప్రవృత్తిని వివరించకపోతే ఆ నిరీక్షణ కర్థం లేదు.

ఆ రోజుల్లో నా స్వభావ విరుద్ధమైన యాంత్రిక జీవనంలో కాలాన్ని బరువుగా ఈడ్చుతున్నట్లనిపించేది. అప్పుడు నాకు ఆత్మీయు లెవరూ లేరు. ఉన్నా—నేను గుర్తించలేదో, అంతటి సంస్కారం నాలో లేదో. మరి ఎవరి లోపమో, నిజమయిన స్నేహితులే కరవయారు. ప్రతి వారిలోనూ ఏదో స్వార్థం. ఆ చూపుల వెనకా, పలకరింపుల వెనకా, విషపు నవ్వుల వెనకా ఆలస్యంగా బయటపడే స్వార్థం అటువంటి వారిపట్ల ఏహ్యాభావాన్ని కలిగించేది. నిజమయిన స్నేహంకోసం, నన్నే తప్ప నానుంచి ఇతరమేమీ కోరని స్నేహంకోసం మనసు ఎప్పుడూ గాలిస్తూనే ఉండేది. విరిసిన మల్లె నన్ను చూసి నవ్వినా, పిల్ల తెమ్మెర సుతారంగా నన్ను తాకినా, అమాయక ప్రాణి నా వైపు జాలిగా చూసినా హృదయం స్పందించేది.

ఓ రోజు ఏమీ తోచక పత్రిక తిరగవేస్తూంటే రాధ రాసిన కథ నన్నాకర్షించింది. కథకంటే కథ వెనక ఉన్న హృదయం మరింత ఆకర్షించింది. అంతగా గుర్తింపుకూడా లేని ఎవరో ఓ రచయిత్రి కథ అంతగా ఆకర్షించడం నాకేమీ ఆశ్చర్యం కాదు. భావోన్నతమైన ఒక్క సూక్తికే నేను ఎంతగానో కదిలిపోయిన క్షణా లెన్నో ఉన్నాయి. ఇంతకీ ఆ కథ గొప్పదనం, దానిలోని సత్యం అలాంటిది. బలీయమయిన బయటి శక్తులు మనిషిని మానసికంగా ఎంత క్రుంగదీస్తాయో, వాటి నధిగమించలేని ఆ మనిషి మనోవేదనా చక్కగా చిత్రించిం దా రచయిత్రి తన కథ అయిన 'సంఘర్షణ'లో. ఈ కథే చదివి ఉండకపోతే నా గమ్యం వేరుగా ఉండేదేమో! నా హృదయం మాటల కందని జీవన మాధుర్యాన్ని చవిచూసి ఉండేదికాదేమో! కాని, చిత్రం—ఆ కథ చదివిన నాటినుండి స్వర్గానికి సోపానాల్లా ఒక్కొక్క అనుభవమే నన్ను ... నన్నొక్కదాన్నే ఈ లోకంలోకల్లా అదృష్టవంతురాల్ని ననిపింప జేస్తుంది. ఆ రాధను పరిచయం చేసుకోవాలనే బలీయమయిన వాంఛే మా మధ్య ఉత్తరాల వారధి కట్టింది. దాని పునాదే రాధనుండి ఈ మొదటి ఉత్తరం. కవరు లోపలి విషయం ఏదయినా, జవాబు వచ్చింది కదా! అన్న ఆనందాన్ని మనసులో ఫీల్ అవుతూ కవరు చించాను.

### పేరూ ప్రతిష్ఠా

**నిజానికి మనం జీవించవలసిన అవసరం లేదు. ఎప్పుడైనా చచ్చిపోవచ్చు. కానీ, చనిపోయిన తరవాత మన పేరు నిలిచి ఉండాలంటే, బ్రతికి ఏదో సాధించాలి.**

**— అముంజియో**

"సంధ్యా!

ఒక కథను చదివి ఓ హృదయం ఇంతగా స్పందించిందంటే ఆ రచయిత కంతకన్నా ఏం కావాలి? నీ మనసు నా కర్థమయింది. నన్నెందు కలా పొగిడేయడం? నేనూ నీలాంటిదాన్నే. అనుభవమే కళారూపం ధరిస్తే దాని విలువ అపారం. కళకే వన్నె పెడుతుంది. కవి కున్న గొప్పతనం క్రాంతదర్శిత్వం. అందుకే తన అనుభవంలో లేనివిసైతం భావనా జగత్తులో అనుభవించి అక్షర రూప మివ్వగలుగుతాడు.

నీ అభిరుచులు మనిషికి సమగ్రత నిచ్చేటువంటివి.

నా గురించి ఏం రాయమంటావు? కథలు రాయడాన్ని మించి నాకుండే ఇతర అర్హతలు నాకు గర్వాన్నివ్వడంలేదు. ఇంకో హృదయాన్ని గెలుచుకోగలిగే ఆ గొప్ప వరం నా అదృష్టం. నిన్ను నా స్నేహితురాలిగా అనుగ్రహించడ మేమిటి? ఆకర్షింపబడే రెండు హృదయాలు స్నేహం చేయక మానవు.

నీ స్నేహితురాలు. . .

—రాధ."

ఉత్తరం చదువుతున్నంతసేపూ నా నెత్తురు కట్టలుతెంచుకుని ప్రవహించింది. గుండెవేగం హెచ్చింది. ఎన్నిసార్లో చదువుకున్న నా ప్రేమమయి రాధ ఉత్తరం నా హృదయంలో ముద్రింపబడింది. కథ ఆమె పరిచయానికి దారి తీస్తే, ఉత్తరం ఆమె హృదయంలోకే ఆహ్వానించింది. తరవాత మా మధ్య రాని విషయం లేదు. సంగీతమూ, సాహిత్యమూ, సంఘ సమస్యలూ—ఒకటేమిటి సృష్టిలో ప్రతిదీ మాకు చర్చనీయాంశమే. ప్రతి వాక్యం, ప్రతి మాటా, ప్రతి అక్షరం మమ్మల్ని ఎంతో చేరువ చేసేది. రాధ రాసే వాక్యాల్లో బలం నన్ను చకితురాలిని చేసేది. ఒక్కోసారి ఊహల కందని నిజాలని, విజ్ఞానాన్ని నా ముందుంచేది. ఎంత గొప్ప స్నేహితురాలిని సంపాదించావా! అని గర్వపడని రో జుండదు. నాలో అంతకుముందుండే స్తబ్దత, నైరాశ్యం పోయి వాటి స్థానే చురుకుదనం, ఉత్సాహం చోటు చేసుకున్నాయి. నాలోని ఈ మార్పుకు మా కాలేజీలో నా స్నేహితులు ఏదో విశేషమేనని ఆటలు పట్టించడం కూడా కద్దు. ఆత్మ తృప్తి అనేది మనిషిచేత ఎంతటి పనినైనా చేయిస్తుంది. అది లేనివానికి అభివృద్ధి శూన్యం. నా ఆత్మతృప్తే ఆ నిరాశలో నన్ను ముందుకు నడిపింది. సామాన్యుల నుండి నే నో ఉన్నత పీఠాన్నాక్రమించినట్లుండేది.

ఎన్ని ఉత్తరాలు రాసుకున్నా, ఎంత ఆప్యాయత పెరిగినా చాలాకాలం వరకూ రాధను చూడనేలేదు నేను. కనీసం తన ఫొటో పంపమని రాయలేదు. ఎందుకంటే, రాధ ఉత్తరాల్లో భావాలు చాలా మటుకు సామాన్య విషయాసక్తత నధిగమించి వెళ్ళేవి. 'నాకు రాస్తున్నదీ ఓ మనిషే. ఆమెకు ఓ రూపం ఉండి ఉంటుంది. ఆమెను కలుసుకోవాలి' అన్న ధోరణే చూపెట్టేది కాదు. నాకు నేను బయటపడితే అది నా అల్పత్వంగా భావిస్తుందేమో నన్న భయంతో ఊరకుండిపోయాను.

* * *

చాలా కాలానికి వచ్చిన రాధ ఉత్తరాన్ని ఆత్రతగా చదివాను. 'నేను మీ ఊరికి దగ్గరలోకి వచ్చాను. ను వ్వొకసారి రాకూడదా!' అనేదే అందులో ముఖ్యాంశం. ఆ ఆహ్వానంకోసమే ఎదురు చూస్తున్నట్లుగా నా హృదయం పరవళ్ళుతొక్కింది. మరునాడే ప్రయాణమయ్యాను. ఆ ఇల్లు కనుక్కోవడం అంత కష్టమనిపించలేదు.

ఓ సామాన్య గృహం ముందు రిక్షా దిగి బెరుకుగా అడుగులు ముందుకు వేశాను. మా మధ్య ఆర్థిక స్తోమతల ప్రస్తావన ఎప్పుడూ వచ్చి ఉండలేదు. రాధమాటల్లో ఆంగ్ల సాహిత్యపు విజ్ఞానాన్నీ, కళాభిరుచినీ, అనేక రంగాల్లో ఆమెకున్న విశేష పరిజ్ఞానాన్నీ చూసి ఆమె నో గొప్ప ఇంటి బిడ్డ అని పలు పలు విధాల ఊహించుకున్నాను. 'నేను వెళ్ళగానే ఓ అల్సేషియన్ డాగ్ మొరగడం, పోవడానికి సంశయిస్తూ నిలబడిన నన్ను రాధ వచ్చి తెలుసుకుని ఆశ్చర్యంలో మునుగుతూ కాంపౌండ్ మధ్యగా ఉన్న బంగళాలాంటి ఇంటిలోకి తీసుకువెళ్ళడం, ఇంట్లో అందమయిన ఫర్నిచర్, ఇంటినిండా కళాఖండాల అమరిక, నా మనసు పొంగేలా రాధ గలగల మాట్లాడడం, నా సరసనే కూర్చుని నా బిడియాన్ని పోగొట్టడం...' ఇలా ఊహించుకుంటున్నాను. నా ఊహ ఆదిలోనే తారుమారయింది. అంత కొత్తదీ, అంత పాతదీ కాని ఇల్లు. అదీ అద్దె ఇల్లు లాగే ఉంది చూడబోతే. చాలా చిన్నదిగా ఉంది. చుట్టూమాత్రం ఎన్నో మొక్కలు పోషణ తీసుకొని పెంచబడుతున్నట్లున్నాయి. నేను వచ్చిన అయిదు నిమిషాల వరకూ నా రాక ఎవరూ గుర్తించలేదు. ఇంట్లో మనుషులున్నారో, లేదో కూడా అనుమానం కలిగింది నాకు. 'నేను వచ్చే విషయం ముందుగానే తెలియజేశానే! అయినా, పిలిచి చూద్దాం' అనుకొంటూ మరో రెండడుగులు ముందుకు వేశాను. నా ఆలోచనలకు భంగం కలిగిస్తూ, "ఎవరు కావాలండీ" అని అడిగిం దొకామె. ఆమె మసి చేతులు ఆమె నో పనిమనిషిగా నిరూపిస్తున్నాయి.

"రాధ ఉన్నారా?" అని అడిగాను కొంచెం పెద్దగానే, లోపల రాధ ఉండి ఉంటే వినబడాలనే ఉద్దేశంతో. నా ఉద్దేశాన్ని నెరవేరుస్తూ ఒక అమ్మాయి బయటికి వచ్చింది. నేను క్షణం పాటు స్తబ్దుగా నిలుచుండి, నాకు రాసే ఉత్తరాల్లోని భావాలకూ, ఎదురుగా కనబడే ఆ సౌందర్యరాశికీ సమన్వయం కుదుర్చుకో ప్రయత్నిస్తున్నాను. ఆ సమన్వయం కూడా అట్టే కష్టమనిపించలేదు. తిరిగీ అనుమానం వేసింది—'నే నూహించుకునే పాతికేళ్ళ రాధా, ఈ అమ్మాయీ ఒకరు కారేమో! ఈ అమ్మాయికి ఇరవై ఏళ్ళు కూడా ఉన్నట్లు లేదు' అనుకున్నాను. అప్పుడే అల్లి వదిలిన రెండు బారు జడలూ, ఆమె దేహ కాంతికి మరింత మెరుగు పెడుతూ లేజారంగు చీరా, అతి సుకుమారంగా కనిపించేఆశరీరలావణ్యం...

# రాగ హృదయాలు



బొమికలు పైకెత్తడంలోనే అతని రాధ అన్నయ్య రవి.

— కె. శోభ

ఆడదాన్నయిన నాకే అలా చూడా లనిపించేట్టు చేసింది.

"నేను ... సంధ్యని ... రాధ ..." అర్థోక్తిలోనే ఆగిపోయిన నా మాటలు గ్రహించి అంది: "నేనే రాధను... రండి, లోపలికి ... కూర్చోండి" అంది. ఆ సంబోధనకి ఆశ్చర్యపోయాను. ఉత్తరాల్లో చనువుగా పలకరించే రాధ, ఆ సంబోధనతో నన్ను ఎన్నో మైళ్ళ దూరానికి నెట్టివేసిన ట్లనిపించింది. కొత్తదనం, తొలిసారి చూసుకోవడం మూలాన అలా మన్నించి ఉండవచ్చునని సరిపెట్టుకున్నాను. కాని, తరవాత కూడా రాధలో 'అండీ' ధోరణి మారకపోవడం బాధ కలిగించింది.

"అండీ అనడం ఎప్పటి నుండి మొదలెట్టావు, రాధా?" అన్నాను.

"ఓ! సారీ, సంధ్యా" అంటూ తడబడింది రాధ.

"ఎన్నాళ్ళనుంచి ఎదురుచూశానో ఈ రోజుకోసం" అన్నాను.

"అవును. నేను కూడా నిన్ను చూడాలని ఎంతగా కలలు కన్నానో!" అంది ఆ మాటలు మనసులోంచి వచ్చినట్టు కాక పలికించినట్టున్నాయి.

"రైల్లో వచ్చావా? బస్సులో వచ్చావా? ఏం చేస్తున్నావు? సినిమాలంటే ఇష్టమేనా? ఏయే సినిమాలు చూశావు?" ఇలాంటి అనవసర ప్రశ్నలెన్నో వేసింది. దేనికీ సమాధానం చెప్పలేదు నేను.

"కథలేమీ రాయడం లేదేం ఈ మధ్య?" అని అడిగాను.

"ఏమిటో ... మూడ్ లేదు" అంది ముక్తసరిగా, అనాసక్తతతో. చూడాలన్న కాంక్షని గుండెనిండా నింపుకొని వచ్చిన నా ఆనందం అంతా దిగజారిపోజొచ్చింది.

ముఖం కడుక్కోమని బాత్‌రూమ్ చూపించి, నే నొచ్చేలోపల కాఫీ తయారు చేసి తెచ్చింది. ఇద్దరం కాంపౌండ్‌లోని చెట్ల మధ్య కుర్చీలు వేసు క్కూర్చున్నాము. ఆ ఇంట్లో రాధ తప్ప ఇంకెవరూ కనబడలేదు. పనిమనిషి అంతకు ముందుగానే రాధకు చెప్పి వెళ్ళిపోయింది. ఏవో కబుర్లు చెప్పుకుంటూ గడిపాము. ఎవరో వస్తున్న చప్పుడవడంతో అటువైపు చూశాను. తెల్లని లాల్చీ, పైజామాలో నిండైన విగ్రహం. పడక తీరులోనే ఉత్తమ సంస్కారం స్ఫురిస్తోంది. చెరగని చిరునవ్వుని ముద్రించుకున్న పెదాలూ, అరమోడ్పులుగా ఉన్న కళ్ళూ, పొడవైన ముక్కూ ఎంతో ఆకర్షకంగా ఉన్నాయి.

"మా అన్నయ్య, సంధ్యా" అంటూ పరిచయం చేసింది, అతను రావడంతోనే రాధ.

శ్యాన్న మాట్లా తృ. కథలు మిమ్మల్ని ఎంతగా ఇంప్రెస్ చేస్తున్నా యన్న మాట" అన్నాడు, మాతోపాటు తనూ కుర్చీ తెచ్చుకుని కూర్చుంటూ

"అయితే. నా గాఢ ... "కథకురాలికంటే కథల ... హృదయం వన్నెక్కువ ఆకర్షించింది."

"అంటే, బహుశా మీ ఇద్దరి అభిరుచులూ, భావాలూ చాలా సన్నిహితంగా ఉండి ఉండాలి."

"కావచ్చు. కాని, విశాల హృదయాల మధ్య విరుద్ధభావాలు అడ్డుగోడలుకావని

కే నభిప్రాయపడతాను."

"ఆ భిన్నత్వంలో సైతం ఎక్కడో, ఏ మూలో ఏకత్వం ఉండకపోదు. ఆ ఏకత్వమే హృదయాల్ని కలుపుతుంది. ఏ విధమైన ఏకత్వమూ లేని హృదయాలు దగ్గిరెలా అవుతాయి?"

"నిజమే మీ రన్నది. ఇంతకీ మా ఇద్దరి విషయంలో మీ ప్రశ్నకు తావే లేదు. అంతగా ఇద్దరి అభిప్రాయాలూ కలిసిపోయాయి" అంటూ రాధ వంక చూశాను. కొంచెం విసుగ్గానే కనిపించింది రాధ ముఖం. నాకు సహాయంగా మాట కలుపుతుందన్న నా ఆశ నెరవేరలేదు. పైగా ఆ విషయాలపై ఆసక్తి చూపక ఎటో చూస్తూ ఏదో ఆలోచిస్తోంది.

"మీరు రాధను చూసింది కథల ద్వారానే కదా. అందరి కథకులూ వారి ఆత్మీయతను ప్రకటించరు. ఒకవేళ ప్రకటించినా, దానికి పూర్తి భిన్నమయిన విషయాలు వారి నిజజీవితంలో చూస్తాము. నే ననే దేమంటే, మీరు మా చెల్లి విషయంలో పొరబడలేదుకదా అని" అన్నాడు చిరునవ్వుతో, హుందాగా వెనక్కు వాలుతూ. ఇప్పుడిప్పుడే ఆ కథల రాధకూ, ఈ రాధకూ సమన్వయం కుదరక తికమకపడే నన్ను అతని మాటలు మరికొంత భయపెట్టాయి. అతని మాటల్లో సత్యం లేకపోలేదు. కట్నాల కర్కశత్వాన్ని మనసుకు హత్తుకునేట్లు చిత్రించి, తమ నిజజీవితంలో బేరమాడి మరీ ఎక్కువ కట్నాలు పుచ్చుకున్న వారూ, ఇచ్చిన వారూ ఎంతమంది లేరు? సంఘంలోని మూఢత్వాన్నీ, కుళ్ళునీ వ్యతిరేకించే ఉజ్జ్వలసాహిత్య సృష్టిచేసీ తామూ కుళ్ళులోనే జీవితాన్ని సాగించిన వారు ఎంతమంది లేరు? నిజానికి ఇవేమీ హృదయం నుంచి వచ్చినవి కావు. అందుకే నా కనిపిస్తుంది—ఆర్టిస్టుకు నిజాయితీ ఉండాలని, తన రచనలకు తాను జవాబుదారీ అవాలని; అదే నిజమయిన కళ అని. తన చెల్లెలిమీదే, ఆమె ముందే నిష్కపటంగా మాట్లాడే అతని మీద గౌరవం అధికమయింది.

రాధ ఉత్తరాల్లోని మాటలు గుర్తుకు వచ్చి పై ఆలోచనల నన్నింటినీ చెదరగొట్టేశాయి. ఆ ధైర్యంతోనే అన్నాను:

"మీకు తెలియదు. మాకు ఉత్తరాల ద్వారా ఎంతో పరిచయముంది. ఆ పరిచయంలో రాధ నా కర్థమయింది." నా మాటలకు రాధ ముసిముసిగా నవ్వి కొద్దిగా సిగ్గుపడుతూ కాలి వేల రాయసాగింది. ఆ సమయంలో అలా సిగ్గుపడటం నాకు సహజంగా తోచలేదు.

"మాట్లాడవేం, రాధా, మీ అన్నయ్య నీ మీద అభాండాలు వేస్తున్నా" అన్నాను.

"అబ్బా, పోనిద్దురూ అవన్నీ ... మంచి పిక్చరేదో ఉందట వెళదామా?" అంటూ మాట మార్చేసింది, రెండు జడలూ ఒక వైపుగా ముందుకు వేసుకొని వాటి చివరలు వేళ్ళతో తిప్పుతూ, కాళ్ళు ఊగిస్తూ. రాధలో పసితనం పోలేదనిపిస్తుంది. ఇంత అమాయకత్వంలోంచి అంత తీవ్ర భావాలెలా వచ్చాయా అని అనుమానం వేసింది. ఇంతలో 'ఇందిరా' అని పిలుస్తూ ఓ పద్దెనిమిదేండ్ల అమ్మాయి ప్రవేశించింది.

"అబ్బ! ఇంత ఆలస్యమేం? నీకోసమే చూస్తున్నాను" అని, "మేం అలా వెళ్ళి వస్తాం, అన్నయ్యా" అంటూ నా వైపు తిరిగి "సంధ్యా! ఈలోపల మీ చర్చ కానీండి. తొందరగానే వచ్చేస్తా" అంటూ క్షణంలో మాయమయింది ఆ వచ్చిన పిల్లతో. నన్ను మొదట ఆశ్చర్యపెట్టిన విషయం ఆ వచ్చిన అమ్మాయి సంబోధన; రెండవది—నన్ను ఒక్కదాన్నీ అలా వాళ్ళన్నయ్య దగ్గిర వదిలి వెళ్ళడం. కాని, ఆ కొద్ది నిమిషాల్లోనే మా మధ్య పెరిగిన గొప్ప పరిచయాన్ని నేను గుర్తించలేదు. నా సందేహాలను ముఖం చూడే కనిపెట్టిన రవి తన చెల్లెలి పేరు ఇందిరేననీ, 'రాధ' అనేది 'పెన్ నేమ్' అని చెప్పాడు. ఉత్తరాల్లో ఈ విష రాధ ఎప్పుడూ రాయనే లేదు. నా 'రాధ' అనే పేరంటే ఎంతో ఇష్ట 'రాధా, రాధా' అని పిలిచే ఆ మాధ




అత్యంత
అధునాతనమైన

VIMAL
A RELIANCE PRODUCT

వస్త్రాలకై
సందర్శించండి

PHONE : 76545

ప్రత్యేక షోరూం
జూలూరు వీరేశలింగం
ఎంటర్‌ప్రైజెస్
జనరల్ బజార్ సికింద్రాబాద్

అనురాగాన్నంతా ఆ రెండక్షరాలూ నింపుకున్నాయా అనిపిస్తుంది.

"వాస్తవికతను విస్మరించే ఊహల గారడీ రచనలు మా చెల్లెలివి. ఆ విషయంలోనే మా ఇద్దరికీ వాదన జరుగుతూ ఉంటుంది. వాస్తవికతకి పూర్తిగా దూరమయ్యే ఆ ఊహాగానాల కెందు కంత విలువ నిస్తారో అర్థం కాదు" అన్నాడు రవి, మరో వాదనకి ఉద్యుక్తుడవుతూ.

"ఊహాగానాలుమాత్రం వాస్తవానికి దూరమని ఎందు కనుకోవాలి? నా మటుకు నాకు అవీ ఎంతో వాస్తవాలు గానే కనిపిస్తాయి. వాటి ముందివి ఏపాటి? నా కళ్ళకు గులాబీ మృదుత్వం పసిపిల్లల మదమలనీ, విడుగుతున్న దాని సోయగం కన్నెపిల్ల ముగ్ధత్వాన్నీ స్ఫురింపజేస్తుంది. అది నాకు వాస్తవమే. నా అనుభూతి నాకు స్పష్టం" అన్నాను తీవ్రంగా.

"కాదని నే ననడం లేదు. వాటి విలువ గొప్పదే. వాస్తవాన్ని పూర్తిగా విస్మరించక ఊహాలకు జోడిస్తే ప్రయోజనకరంగా ఉండదా? ఆకలితో మాడే వాడికి రసానుభూతి తెలుస్తుందా? ముందు వాడి అవసరం తీరాలి. ఏదీ ఈ రచయితలని నాలుగు రోజులు తిండి పెట్టక రాయమనండి. దాని శక్తి అలాంటిది మరి" అన్నాడు ఖండితంగా.

"అలాంటి పరిస్థితి మన ఇద్దరిలో ఇప్పుడు ఉన్నా, ఈ వాదన సాగేది కాదు. రాస్తున్నవాడూ, దాన్ని అనుభవించే వాడూ తీరి కూచునే చేస్తున్నారా పని. తన భావనా జగత్తుని ఆచరణలోకి తెచ్చుకొనే ఏ మనిషీ వాస్తవాన్ని విస్మరించలేడు. ఓ కళలో అదే ప్రధానంగా చూపవలసిన అవసరం తక్కువ."

"నేను ఎక్కువ స్ట్రెస్ చేస్తున్నది సాంఘిక ప్రయోజనం మీద. ఊహాలోకాన్ని నిజజీవితంలో సృష్టించుకోవడంలోని ఆవకతవకలు రచయిత దృష్టిలో ఉండి, వాటిని కూడా అధిగమించేట్టు చూడగలిగే రచన ఉత్తమం."

"ఒప్పుకుంటాను. ఓ గొప్ప విలువ ముందు తక్కిన విలువలు సూర్యకాంతి ముందు ప్రమిద దీపా లవుతాయి. మనుషుల్లో ప్రతి వ్యక్తికీ కావలసిన మానసికాభివృద్ధి ప్రయోజనం గురించి మీ రాలోచించడం లేదు. దాని ముందు తక్కిన ప్రయోజనా లేపాటి?"

గేటు చప్పుడయింది.

ఇద్దరం చటుక్కున అటు చూశాము. రాధ! ఆ సమయంలో రాధ రావడం ఇద్దరికీ ఇష్టంగా లేదు. కాని, నేను వచ్చింది ఎవరికోసం? ఆ వ్యక్తి రాక నా కసంతృప్తి కలిగిస్తుం దిప్పుడు. మనసు ఎంత చిత్రం! అక్కడ ఉన్న రెండు రోజులూ రవి ఉనికి ఎంతో ఉల్లాసాన్ని కలిగించింది. ఆ ఇల్లంతా మేం ముగ్గురమే అవడంతో చాలా సరదాగా గడిపాము. వాళ్ళక్కడ ఉండడానికి రాధ కాలేజీ చదువుకు రావడమే కారణం. తల్లి తండ్రులు ఏదో పల్లెలో ఉంటున్నారని తెలిసింది. రాధ పనులలో నేనూ సాయం ఉండేదాన్ని. రవి సరదా మాటలతో గంటలు ఇట్టే గడిచిపోయేవి. నేను వచ్చేసే రోజు రాధకంటే రవి కళ్ళలోనే బాధ పొర చూశాను. ఆత్మీయుని విడిచి పోతున్న అనుభూతి కలిగింది. ఒక స్నేహితురాలికోసం వెళ్ళిన నాకు మరో మంచి మిత్రుడు దొరికాడు.

* * *

దస్తూరీ చూస్తూనే నాకు వచ్చిన ఉత్తరం రాధ నుండే నని గ్రహించాను. రాధ, రవీ మనసులో మెదులుతూండగా ఆత్రతతో కవరు చింపాను.

"ప్రియ సంధ్యా!"

ఇలాంటి సంబోధన అదే మొదటిసారి. రాధ ఎప్పుడు రాసినా "ప్రియమైన సంధ్యకు" అనే రాసేది.

"నీ రాక ఎండి బీటలు వారిన నా హృదయ క్షేత్రంపై తొలకరి వానలు కురిపించింది."

ఎంత ఆప్యాయత ఆ గుండెలో!

"నేను కావాలనే ఓ చిన్న తప్పు చేశాను. ఆ తప్పు మనసులు కలుపుతుందే తప్ప ఎవరికీ ఏ కీడూ చేయదు."

ఏమి టిలా రాస్తుందనుకున్నాను. తను నాతో అంత చొరవగా లేకపోయి నందుకు సంజాయిషీ ఏమో! అర్థం కాలేదు.

"ఆ కథలు రాసేదీ, నీ జాబుకు జవాబు లిచ్చేదీ, ఇప్పుడు రాస్తున్నదీ ఈ 'రాధే' అంటే ఈ 'రవే'. ఏం? నా రాతలకూ, నాకూ సమన్వయం కుదరడం లేదా? 'మనుషులేం ప్రాముఖ్యం? ఆడా మగా, చిన్నా పెద్దా — అన్ని తారతమ్యాలనూ అధిగమించి ఐక్యమవడం ఎంత అదృష్టం' అని ఎన్ని కబుర్లు చెప్పుకున్నాం! మనం. అందుకే ఓ చిన్న తమాషా చేశాను. అయితే, నీ మనసులో "ఇందిర" మెదులుతూంది కదూ! అవును. మా చెల్లెలే ఇందిర. కాకపోతే కథలూ, గొడవా ఏమీ పట్టవు— సినిమాల పిచ్చి తప్ప. ఈ కాస్త నాటకానికే నా చేత ఎన్ని వాగ్దానాలు చేయించుకుందో? నువ్వటు వెళ్ళగానే ప్రతి రోజూ సినిమాకు తిప్పాను.

అకస్మాత్తుగా మగవాడిగా మారిపోయిన (నీ మనసులో) ఈ రవి మీద ఇప్పుడు ప్రేమ లేదా? లేకపోతే నీ భావాలకి నీవు బాధ్యత వహించడం లేదన్నమాట. అప్పుడలా వాదించాను కాని, నేను నీతో పూర్తిగా ఏకీభవిస్తాను. మరి ఎప్పటిలా నీకు సన్నిహితంగా ఉండమంటావో, దూరంగా ఉంచుతావో? దూరంగా ఉంచేట్టయితే నేను 'రాధ' గా ఉండాలనే అనుకుంటాను. నువ్వు స్వీకరిస్తే ఈ రవి రవిగానే ఉంటాడు.

నీ అహ్వానానికి ఎదురుచూస్తూ...

—'రాధ' (రవి)."

ఈ ఉత్తరం చదివిన నా పరిస్థితి వర్ణనాతీతం. ఆనందంతో నృత్యం చేయాలనీ, మోయలేని ఈ అనుభూతిని ఎవరితోనయినా పంచుకోవాలనీ ఉవ్విళ్ళూరింది మనసు.

* * *

గాలికి కిటికీ రెక్కలు కొట్టుకుంటున్నాయి. రసజగత్తులో మునిగిన నాకు అవి ఎప్పటినుండి అలా కొట్టుకుంటున్నాయో వినబడలేదు గాని, అకస్మాత్తుగా కొట్టుకోవడం ఆగిపోవడంతో ఈ లోకపు స్పృహ కలిగింది. ఎవరో వాటి నలా కొట్టుకోకుండా బోల్టు పెట్టి ఉంటారు. ఏదో స్వర్గం నుండి ఈ భూలోకానికి జారిపడ్డట్టయ్యాను. బయట చిటపటమంటూ ఒక్కొక్క చినుకే పడుతూంది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. చల్లని గాలి ఉండి ఉండి లోపలికి ప్రవేశించి నా ఒంటిని తాకుతూంది. కాంపౌండ్‌లోని చెట్లన్నీ తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నాయా అన్నట్లు తల లూగిస్తున్నాయి. నా వెనక అడుగుల సవ్వడి. "సుందర ప్రకృతి లోకమంతా వేడుక చేస్తుంటే ఇలా తలుపులు బిగించుకొని రాసుకొంటూ కూర్చోవడం మన స్వభావాలకు విరుద్ధం కదూ, సంధ్యా!" అని నా చెవిలో అంటూన్న కంఠం తాలూకు చేతులు నన్ను చుట్టాయి. నా కలం ఆగుతూంది. ఆ చేతుల తాలూకు వ్యక్తి ఎవరో నేను చెప్పనక్కరలేదు. ✳

పుష్కరిణి — ఫొటో— మద్దాలి వెంకటేశ్వర్లు (సికిందరాబాదు)

